సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం, 2, మే, 2025



కనుల పండువగా కల్యాణోత్సవం

పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వాముల కల్యాణ మహోత్సవాలు కనుల పండువగా జరిగాయి. -8లో



గాలి, వాన బీభత్సం

జిల్లాలో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. పలు ప్రాంతాల్లో పంటలు దెబ్బతినగా.. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
42.5/28.0

వాతావరణం

జిల్లాలో గురువారం 28.0 - 42.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

సీఐల బదిలీ

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలో పని చేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మైదుకూరు సీఐ శ్రీహరిని కడప సీసీఎస్–2కు బదిలీ చేశారు. సీసీఎస్–2 సీఐగా ఉన్న రెడ్డెప్ప కడప తాలూకా సీఐగా, తాలూకా సీఐ వెంకటేశ్వర్లును వీఆర్‌కు, ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్ సీఐ రమణారెడ్డిని మైదుకూరు అర్బన్ సీఐగా, అన్నమయ్య జిల్లా వీఆర్‌లో ఉన్న రియాజ్ అహ్మద్‌ను ఫ్యాక్షన్ జోన్‌కు బదిలీ చేశారు. అలాగే కడప వీఆర్‌లో ఉన్న వెంకటకుమార్ ఫ్యాక్షన్ జోన్‌కు బదిలీ అయ్యారు. ఆయా సీఐలు తమకు కేటాయించిన స్టేషన్లకు వెళ్లి రిపోర్టు చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

8న ప్రతిభా పురస్కారాలు

కడప రూరల్: ఈ ఏడాది టెన్త్, ఇంటర్మీడియెట్ లలో అత్యధిక మార్కులు సాధించిన దూదేకుల విద్యార్థులకు అబ్దుల్ కలాం పేరిట ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు దూదేకుల నూర్‌బాషా సంఘం జిల్లా నాయకులు ఖాదరయ్య, గౌరవాధ్యక్షులు ఆయిల్ మిల్ ఓబులేశు, అజ్మతుల్లా, నజీర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి టెన్త్‌లో 550 మార్కులు, ఇంటర్మీడియెట్‌లో 950 మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని వారు పేర్కొన్నారు. ప్రతిభ గల విద్యార్థులు ఈనెల 8న నిర్వహిస్తున్న పురస్కార ప్రదాన కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్: 97040 69249లో సంప్రదించాలని వివరించారు.

'నీట్' అభ్యర్థులు నిబంధనలు పాటించాలి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఈ నెల 4న నీట్ యూజీ- 2025 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఎన్టీఏ సూచించిన నియమ నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రొద్దుటూరులో రెండు, కడపలో ఆరు పరీక్ష కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. మొత్తం 2428 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని వివరించారు.

రిమ్స్‌లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: కడపలోని సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లో పని చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. అనస్థీషియా టెక్నీషియన్ 4, ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ 6, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 తొమ్మిది పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిన జూనియర్ అసిస్టెంట్ 2, డేటా ఎంట్రీ ఆపరేటర్ 2, ఎలక్ట్రీషియన్ 1, జనరల్ డ్యూటీ అటెండెంట్ 44, ప్లంబర్ ఒక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆయా పోస్టులకు సంబంధించి ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు హెచ్‌టీటీపీఎస్//డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కడప.జీఓవీ.ఏపీ.ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని వివరించారు.

మేడేపై అవగాహన వారోత్సవాలు



మాట్లాడుతున్న న్యాయమూర్తి బాబా ఫక్రుద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్: వివిధ రంగాల్లో పని చేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు 1 నుంచి 7వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మేడే అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. గురువారం కడప ఆర్టీసీ గ్యారేజీలో మేడేని పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మికుల దినోత్సవ ప్రాధాన్యత వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఎస్.ప్రసాద్, ఆర్టీసీ కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు, డిస్ట్రిక్ట్ ప్రొబెషనర్ ఆఫీసర్, కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పారా లీగల్ వలంటీర్లు, అసంఘటిత రంగ కార్మికులు పాల్గొన్నారు.

భరోసా ఇచ్చి.. సాంత్వన చేకూర్చి..

- నష్టపోయిన రైతులను ఆదుకున్న వైఎస్సార్‌సీపీ
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్
- 670 మంది రైతులకు రూ.1.14 కోట్ల ఆర్థిక సాయం
- అరటి రైతుల హర్షాతిరేకం



తాతిరెడ్డిపల్లెలో అకాల వర్షం, ఈదురుగాలులకు కూలిన అరటి పంట (ఫైల్)



తాతిరెడ్డిపల్లెలో అరటి పంట నష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

పులివెందుల/లింగాల: అధికారంలో ఉన్నా, లేకున్నా.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకుని రైతు పక్షపాతి అని నిరూపించుకున్నారు. మార్చి 22వ తేదీన ఈదురు గాలులు, వడగండ్ల వానకు లింగాల మండలంలో అరటి పంట భారీగా కూలిపోయి అపార నష్టం వాటిల్లింది. మార్చి 24న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో కలిసి వెలిదండ్ల, తాతిరెడ్డిపల్లె, కోమన్నూతల గ్రామాల్లో.. దెబ్బతిన్న అరటి పంటలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అపార పంట నష్టాన్ని చూసి ఆయన గుండె తరుక్కుపోయింది. రైతుల కష్టం, నష్టాన్ని కళ్లారా చూసి చలించిపోయారు. 'నష్టపోయిన రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది. అధైర్యపడొద్దు, తోడుగా నేనున్నాను' అనే భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఆదుకోకపోయినా.. వైఎస్సార్‌సీపీ తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మొత్తం 1420 ఎకరాల్లో అరటి పంట దెబ్బతిని 670 మంది రైతులు నష్టపోయారని గుర్తించారు. వారికి హెక్టారుకు రూ.20 వేల చొప్పున వైఎస్సార్‌సీపీ తరఫున వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం అందిస్తున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గురువారం విలేకరుల సమావేశంలో ప్రకటించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.



వారం వ్యవధిలో..

ఉద్యాన, రెవెన్యూ శాఖల అధికారులు రూపొందించిన వివరాలు, నివేదికను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పంపడం జరిగిందని, దాని ఆధారంగా రైతుల పేర్లపై డీడీలు పులివెందుల పార్టీ కార్యాలయానికి చేరాయని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. వారం రోజుల వ్యవధిలో ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో సంబంధిత రైతులకు అందజేయడం జరుగుతుందని ఆయన ప్రకటించడంతో.. రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. నష్టపోయిన 670 మంది రైతులకు వైఎస్సార్‌సీపీ తరఫున రూ.1.14 కోట్ల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రకటించడంతో.. బాధితులకు కొంత ఉపశమనం లభించింది. అదే విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేసిన విధంగా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి బాధ్యత గుర్తెరిగి నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతోపాటు పంటల బీమా అందించాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి డిమాండ్ చేశారు.

మాట తప్పడమే చంద్రబాబు నైజం



సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న దాఖలాలు లేవు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామని చెప్పిన అధికార పార్టీ నాయకులు ఇంతవరకు ఇటువైపు కన్నెత్తి చూడలేదు. వైఎస్ జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారంలో లేకపోయినా రైతులను ఆదుకుంటున్నారు. - మండలపల్లె కేశవయ్య, నష్టపోయిన అరటి రైతు, తాతిరెడ్డిపల్లె

వైఎస్ కుటుంబమే అండ



పులివెందుల ప్రాంత రైతులు, ప్రజలకు వైఎస్ కుటుంబమే అండగా నిలుస్తోంది. అన్నదాతను ఆదుకునేందుకు తామున్నామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నెల రోజుల్లోనే.. తీవ్రంగా నష్టపోయిన అరటి రైతులకు తన వంతు ఆర్థిక సాయం అందించడం హర్షించదగ్గ విషయం. - పురుషోత్తమరెడ్డి, నష్టపోయిన అరటి రైతు, కోమన్నూతల

ప్రభుత్వం ఆదుకోవాలి



తీవ్రంగా నష్టపోయిన అరటి రైతులను ఆదుకునేందుకు ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వచ్చారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తీవ్రంగా నష్టపోయిన అరటి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతోపాటు పంటల బీమా అందించి ఆదుకోవాలి. - పి.సి.వాసుదేవారెడ్డి, తీవ్రంగా నష్టపోయిన అరటి రైతు, కోమన్నూతల

అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ

- నష్టపోయిన ప్రతి రైతుకు హెక్టారుకు రూ.20 వేలు
- రైతుల పట్ల చిత్తశుద్ధి లేని కూటమి ప్రభుత్వం
- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: లింగాల మండలంలో అరటి పంట నష్టపోయిన రైతులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని భాకరాపురంలో గల వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 22న వడగండ్లు, ఈదురు గాలులతో లింగాల మండలంలో అరటి పంటకు నష్టం వాటిల్లిందన్నారు. మార్చి 24న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఆ గ్రామాల్లో తిరిగి అరటి పంట నష్టాన్ని పరిశీలించి రైతుల్లో ధైర్యం నింపారన్నారు. మార్చి 22న పంట నష్టం జరిగిన ప్రతి రైతుకు పార్టీ తరఫున వీలైనంత వరకు సాయం చేస్తామని అప్పుడు వైఎస్ జగన్ ప్రకటించారన్నారు. ఉద్యాన, రెవెన్యూ అధికారులు తయారు చేసిన క్రాప్ లాస్, హార్టికల్చర్‌ఎమ్యునరేషన్ డేటాను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పంపినట్లు చెప్పారు. మార్చి 22న 670 మంది రైతులకు సంబంధించి 1420 ఎకరాల పంట నష్టం జరిగిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక నిర్ణయం తీసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున తక్షణం ఆదుకునేందుకు ముందుకు వచ్చారన్నారు. నష్టపోయిన 670 మంది రైతులకు హెక్టారుకు రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. అందుకు సంబంధించి 670 మంది రైతుల పేర్లతో డీడీలు పులివెందులకు పంపినట్లు చెప్పారు. ఈ డీడీలను వారంలోపు ఆయా గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులతోపాటు రైతులను పిలిపించి పార్టీ కార్యాలయంలో అందజేయడం జరుగుతుందన్నారు. 670 మంది రైతులకు కలిపి రూ.1.14 కోట్లు వైఎస్సార్‌సీపీ తరఫున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు చెప్పారు.

ప్రభుత్వం కళ్లు తెరవాలి

అరటి పంట నష్టపోయిన రైతులకు జగనన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున అందిస్తున్న ఆర్థిక సాయాన్ని చూసైనా.. ప్రభుత్వం కళ్లు తెరిచి తన బాధ్యత గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వంలో కూడా ఎంతో కొంత చలనం వస్తుందని ఆశిస్తున్నామన్నారు. మార్చి 24వ తేదీన జగనన్న ప్రెస్‌మీట్‌లో నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీతోపాటు పంటల బీమా కూడా ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేయడం జరిగిందన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతోపాటు పంటల బీమా కూడా ఇస్తేనే వారు ఎంతో కొంత కోలుకుంటారన్నారు.

కోల్డ్ స్టోరేజీ అందుబాటులోకి తేవాలి

వైఎస్ జగనన్న ప్రభుత్వంలో వైఎస్సార్ జిల్లా పులివెందుల టౌన్‌లో అరటి రైతుల కోసం 50 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఇంటిగ్రేటెడ్ కోల్డ్ స్టోరేజీని రూ.26 కోట్లతో ఏర్పాటు చేశారన్నారు. ఎన్నికల ముందు దాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. అయితే ఈ ప్రభుత్వం వచ్చి దాదాపు ఏడాదవుతున్నా యూజర్ ఏజెన్సీని ఐడెంటిఫై చేయలేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, లింగాల మండల కన్వీనర్ అంబకపల్లె బాబు రెడ్డి, తాలూకా రైతు విభాగం నాయకుడు లింగాల శేఖరరెడ్డి, అరటి రైతులు మల్లికేశ్వరరెడ్డి, మల్లికార్జునరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, హేమాపతిరెడ్డి, గంగాధరరెడ్డి, నాగచంద్రారెడ్డి, గంగిరెడ్డి, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా జూదాలు, దొంగతనాలు

ఒకప్పుడు పులివెందుల, కడప పేర్లు చెబితే అభివృద్ధి, సంక్షేమం గుర్తుకు వచ్చేవని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు పులివెందుల, కడప పేర్లు చెబితే జూదం తప్ప ఏదీ కనిపించడం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో అక్రమ ఇసుక, అక్రమ బెరైటీస్ మైనింగ్, దొంగతనాలు తప్ప ఏమీ గుర్తుకు రాలేదన్నారు. విపరీతంగా జూదాలలో డబ్బులు పోగొట్టుకుని.. వాటి కోసం కేబుల్, బంగారు దొంగతనాలు చేస్తున్నారన్నారు. వీటిని అరికట్టాల్సిన పోలీసులు నో లా అండ్ ఆర్డర్ అన్నట్లు ప్రవర్తిస్తున్నారన్నారు. పోలీసులు పొలిటికల్ పోలీసింగ్ మాత్రమే చేస్తున్నారన్నారు. కేవలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను వేధించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. అలాగే గంజాయి మత్తులో యువత పెడదారిన పడుతున్నారన్నారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను పోలీసులు అరికట్టాలన్నారు. మన హయాంలో ఊరికో సచివాలయం తీసుకొస్తే.. టీడీపీ హయాంలో వీధికో మద్యం షాపు తెచ్చినట్లు ఉందన్నారు.

చల్లగా చూడమ్మా.. గంగమ్మా



గంగమ్మకు పూజలు చేస్తున్న రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



జాతరలో భారీగా భక్తజనం

గంగమ్మను దర్శించుకొన్న రాజంపేట ఎంపీ

రైల్వేకోడూరు అర్బన్: ప్రజలు చల్లగా ఉండేలా దీవించాలని గంగమ్మను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి వేడుకున్నారు. రైల్వేకోడూరులో నిర్వహించిన గంగమ్మ జాతరలో వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికారప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులుతో కలిసి ఎంపీ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఎంపీ, మాజీ ఎమ్మెల్యేను సత్కరించారు. ఈసందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ 100 ఏళ్ల చరిత్ర కలిగిన కోడూరు గంగమ్మను దర్శించుకోవడం ఎంతో అదష్టమని తెలిపారు. రైతులు, పేద ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డిధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ తోటశివసాయి, సీహెచ్‌రమేష్, జిల్లా యువజన అధ్యక్షుడు శివారెడ్డి, తల్లెంభరత్ కుమార్‌రెడ్డి, గునిశెట్టిరమేష్, మేడావెంకటసుబ్బయ్య, బుడుగుశివయ్య, డీవీరమణ తదితరులు హాజరయ్యారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం

మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప సెవెన్‌రోడ్స్: కార్మికుల పక్షాన ఉండి, వారి హక్కుల కోసం తమ పార్టీ పోరాడుతుందని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. గురువారం నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత వైఎస్సార్ టీయూసీ జెండాను ఎగురవేసిన అంజద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబు కేక్ కోసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులకు భంగం కలిగించే విధానాలు అమలు చేస్తున్నాయని విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కార్మికుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేశారన్నారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా తండ్రి బాటలో నడిచారన్నారు. ఆటో కార్మికులు దయనీయ పరిస్థితుల్లో ఉండేవారని తెలిపారు. ఎఫ్‌సీ, ఇన్‌స్రూ కూడా చేసుకునే పరిస్థితి లేదన్నారు. ప్రైవేటు అప్పులు తీసుకొచ్చి ఆటోలు కొనుగోలు చేసే ప్రతి నెల ఈఎంఐ చెల్లించేవారని తెలిపారు. సంపాదనంతా ఈఎంఐలకే వెళుతూ కుటుంబ పోషణకు సరిపోయేది కాదన్నారు. ఈ పరిస్థితిని గమనించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.10 వేలు ఇచ్చేవారని తెలిపారు. అలాగే వివిధ కుల వృత్తులు చేసుకుని జీవించే వారికి సైతం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయకపోగా రెడ్‌బుక్ పాలన కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు.



వైఎస్సార్ టీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న మేయర్ సురేష్‌బాబు, మాజీ ఉపముఖ్యమంత్రి అంజద్‌బాషా

సింహాచలం దుర్ఘటనకు ప్రభుత్వానిదే బాధ్యత

సింహాచలం పుణ్యక్షేత్రంలో చోటుచేసుకున్న దుర్ఘటనకు రాష్ట్రప్రభుత్వమే బాధ్యత వహించాలని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే ఎనిమిది మంది మరణించారని తెలిపారు. నిర్మాణంలో నాణ్యత లోపించడం వల్లే గోడ కూలి భక్తులు మరణించారన్నారు. సనాతన ధర్మాన్ని ఆచరిస్తామనే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్కడున్నారని నిలదీశారు. మరణించిన వారికి ముఖ్యమంత్రి రూ.25 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని, దాన్ని రూ.కోటికి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు జాషువ, నగర అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాత కడప చెరువు వద్ద రగడ

- భూమి ఆక్రమించేందుకు యత్నిస్తున్నారంటున్న రైతులు
- పట్టా భూమి అంటున్న ఓ వ్యక్తి
- ఇరు వర్గాల మధ్య వాగ్వాదం
- అధికారుల దృష్టికి సమస్య

టాస్క్‌ఫోర్స్: కడప నగర శివారులోని పాత కడప చెరువు వద్ద రగడ చోటుచేసుకుంది. కొంత మంది వ్యక్తులు టిప్పర్లతో రాత్రికి రాత్రే గ్రావెల్ తోలి చెరువు వద్ద చదును చేసేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలియడంతో పాత కడప రైతులు అక్కడికి వెళ్లి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ మట్టి తోలిస్తున్న వ్యక్తి.. ఇది తన పట్టా భూమి అని, ఇందులో గుంతలను చదువు చేసేందుకు మట్టి, గ్రావెల్‌ను తోలుకుంటున్నానని తెలిపాడు. దీంతో వారి మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. ఇది చెరువు భూమేనని పాతకడప వాసులు, కాదు తన పట్టా భూమి అని వాళ్లు వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం పాత కడప రైతులు కడప తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లడంతో.. ఆయన ఆర్‌ఐను పంపించి పరిశీలింపజేశారు. చెరువును ఆక్రమించే వ్యక్తి బయటి నుంచి గ్రావెల్‌తోపాటు చెరువులో జేసీబీ పెట్టి టిప్పర్‌లో అక్రమంగా భూమికి మట్టి తోలుతున్నట్లు గమనించి.. టిప్పర్‌తోపాటు జేసీబీని సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. అయితే చెరువులో చదును చేస్తున్న భూమికి సంబంధించి పట్టా భూమి అని అది చెరువు భూమి కాదని తహసీల్దారు పాత కడప రైతులకు చెప్పినట్లు సమాచారం. ఈ స్థలాన్ని చదువు చేసే వ్యక్తి బయటి నుంచి గ్రావెల్‌తోపాటు చెరువు మట్టిని కూడా తోలడంతో జేసీబీతోపాటు టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిసింది.



చెరువు వద్ద అభివృద్ధి పనులు చేయకూడదు

ఈ విషయమై పాత కడప రైతులు మాట్లాడుతూ పాతకడప చెరువు 460 ఎకరాలు ఉండేదని, ఇప్పటికే కొంతమేర ఆక్రమణకు గురైందని వాపోయారు. ఈ చెరువు కింద 3 వేల ఎకరాలకుపైగా సాగు భూమి ఉందని, ఇలా ఒక్కొక్కరు చెరువును ఆక్రమించుకుంటూ పోతే తమ కుటుంబాలు ఏ విధంగా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మట్టి తోలే భూమి కూడా చెరువు భూమేనని వారు ఆరోపించారు. ఒక వేళ అది పట్టా భూమి అయినా.. చెరువుకు 75 మీటర్ల దూరంలో ఎలాంటి అభివృద్ధి (ప్లాట్లు వేయడం) చేయకూడదనే నిబంధన ఉందన్నారు. దీంతోపాటు కేసీ కెనాల్‌కు 25 మీటర్ల పరిధిలో ఎలాంటి అభివృద్ధి చేయకూడదనే నిబంధన కూడా ఉందన్నారు. ప్రస్తుతం మట్టి తోలే ప్రదేశం చెరువుకు, కేసీ కాలువకు మధ్య ఉందని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకూడదని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని శుక్రవారం కడప ఆర్‌డీఓ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. చెరువును సర్వే చేసి భూమిని తేల్చే వరకు తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.



చెరువు వద్ద చదును చేసేందుకు తోలిన మట్టి

కనుల పండువగా కల్యాణోత్సవం

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వాముల కల్యాణ మహోత్సవాలు కనుల పండువగా జరిగాయి. క్షేత్రాధిపతియైన పరమ శివుని అంశలోని వైద్యనాథస్వామి కల్యాణంతో పాటు క్షేత్ర పాలకుడైన విష్ణు అంశలోని చెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవం ఒకే రోజు జరగడం ఇక్కడ విశేషంగా చెప్పవచ్చు. ఉదయం శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై శ్రీ కామాక్షీ వైద్యనాథుల కల్యాణ మహోత్సవాన్ని వేద పండితుల ఆధ్వర్యం వైభవోపేతంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం చింతలపత్తూరు అవధానం చెంచు సుబ్రమణ్యం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కల్యాణోత్సవంలో పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి స్వామి పాల్గొన్నారు.

రాత్రి కొండపై చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలోని మంటపంలో ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవిలతో శ్రీ చెన్నకేశవుని కల్యాణం వైభవోపేతంగా జరిగింది. ఉభయ దేవేరులతో స్వామివారికి జరిగిన మాంగళ్యధారణ కార్యక్రమాన్ని కనులారా వీక్షించిన భక్తులు భక్తిభావంతో పులకించిపోయారు. ఈ సందర్భంగా కొండ ప్రాంతమంతా లక్ష్మీ చెన్నకేశవ నామ స్మరణతో మార్మోగింది. అనంతరం మిట్టా నారాయణరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు. అనంతరం శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వామికి, శ్రీ చెన్నకేశవ స్వామికి గజవాహన సేవ నిర్వహించారు.

గరుడ వాహనంపై ఊరేగిన చెన్నకేశవుడు

కాగా గురువారం తెల్లవారుజామున శ్రీచెన్నకేశవ స్వామి తనకు అత్యంత ప్రీతి పాత్రమైన గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి గరుడ వాహన సేవను చూసేందుకు రాత్రంతా పుష్పగిరిలోనే వున్న భక్తులు గ్రామోత్సవంలో స్వామివారిని దర్శించుకుని తరించారు.

నేడు రథోత్సవాలు

బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి రథోత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం 4. 30 గంటలకు శ్రీ లక్ష్మీ చెన్నకేశవుల రథోత్సవం జరుగుతుంది.



వైద్యనాథుని కల్యాణ మహోత్సవంలో తాళిని చూపుతున్న పురోహితులు



చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



తన ఇష్ట వాహనం గరుడునిపై భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ చెన్నకేశవ స్వామి



కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న వేద పండితులు

క్లుప్తంగా

విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజలకు భద్రత



ద్విచక్ర వాహనదారుడికి సూచనలిస్తున్న పోలీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి ప్రజలకు భద్రత కల్పించాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. ఇందులో భాగంగా పోలీసు అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించి అనుమానితులను విచారించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డు భద్రతపై సూచనలు చేశారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపే డ్రైవర్లు సీటు బెల్టు వాడాలన్నారు. అలాగే సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవింగులకు దూరంగా ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలలో తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిన్నాయపల్లె సమీపంలో గుర్తు తెలియని మృతదేహం

పోరుమామిళ్ల : మండలంలోని సిద్దవరం పంచాయతీ చిన్నాయపల్లెకు తూర్పున తెలుగుగంగ కాలువ గట్టున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి కథనం మేరకు వేప చెట్టుకు ఉరి వేసుకుని ఉన్న వ్యక్తి శవాన్ని అడవి జంతువులు లాగడంతో కింద పడిందన్నారు. ఈ ఘటన నెల రోజుల క్రితం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహం కుళ్లిపోయి గుర్తు పట్టేందుకు వీలు లేకుండా ఉంది. మృతుడి ఒంటిపై ఎర్రచొక్కా, గళ్ల లుంగీ ఉన్నాయి. చెట్టుకు చీరతో ఉరి వేయడాన్ని గమనిస్తే ఎవరైనా హత్య చేసి చెట్టుకు వేలాడదీశారా అన్న అనుమానం కలుగుతోంది.

15 మద్యం బాటిళ్లు పట్టివేత

చాపాడు : మండల పరిధిలోని అయ్యవారిపల్లె పంచాయతీ రామదాసుపురం గ్రామంలో గురువారం 15 మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన హనుమంతు అనే వ్యక్తి అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తుండగా దాడి చేశామని ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు.

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ వ్యతిరేకం

- సీఎం చంద్రబాబు మద్దతు తెలపడం దారుణం
- మైనార్టీలకు తోడూ నీడగా వైఎస్సార్‌సీపీ
- ఉద్యమాల ద్వారానే సవరణ చట్టం ఉపసంహరణ
- 4న కడపలో నిర్వహించే లాంగ్ మార్చ్‌ను విజయవంతం చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



రౌంట్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌బాబు

కడప రూరల్ : కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంతో పాటు టీడీపీ కూటమి లాంటి పార్టీలు బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలను అణచివేసేందుకు కుట్ర పన్నుతున్నాయి. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం 2025ను తీసుకొచ్చింది. కుల, మతాలు , పార్టీల కతీతంగా ఏకమై ఈ చట్టంపై పోరాటం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డ్ ఆధ్వర్యంలో ఆ బోర్డ్ కన్వీనర్ హజరత్ ఇషాక్ అలీ అధ్యక్షతన రాజ్యాంగ వ్యతిరేక వక్ఫ్ చట్టం-2025కు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పహల్గాం, సింహాచలంలో మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. అనంతరం కడప మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ మైనార్టీలకు ఎక్కువగా ద్రోహం చేసిందన్నారు. వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. సవరణ చట్టంపై తీవ్ర స్థాయిలో ఉద్యమం చేస్తే బిల్లును అడ్డుకోవచ్చన్నారు. భారతదేశం అన్ని కులాలు, మతాలకు నిలయమని పేర్కొన్నారు. కుల, మతాలకు అతీతంగా అందరూ ఏకమై సవరణ చట్టంపై పోరాడాలని తెలిపారు. మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగానే ఉంటుందని అన్నారు. మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక చట్టాన్ని తేవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం మైనార్టీలకు ఒక్క మేలైనా చేసిందా అని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను అణచివేయడానికే ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎన్డీఏ కూటమిలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు నితీష్‌కుమార్ లాంటి వారు మద్దతు తెలపడంతోనే సవరణ చట్టానికి ఆమోదం లభించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సవరణ చట్టం ద్వారా మైనార్టీలకు మేలు జరుగుతుందని దుష్ప్రచారం చేస్తోందన్నారు. హజరత్ ఇషాక్ అలీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. అందులో భాగంగానే వక్ఫ్ సవరణ చట్టం తీసుకొచ్చిందని తెలిపారు. వక్ఫ్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ బాబూ భాయ్ మాట్లాడుతూ సవరణ చట్టం ఏకపక్షంగా చేశారని, ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. మహ్మద్ అలీ బహాదాది, జాకీర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సత్తార్, పాస్టర్ జాన్ మాట్లాడారు.

లాంగ్ మార్చ్‌ను విజయవంతం చేయాలి..

ఈ నెల 4వ తేదీన కడప నగరంలోని గౌస్‌నగర్ నుంచి ప్రారంభించే లాంగ్ మార్చ్‌ను విజయవంతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుల మతాలు, పార్టీల కతీతంగా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, మౌలానా హిదాయతుల్లా, అలీఖాన్, బాదుల్లా, గుర్రప్ప, నారాయణరెడ్డి, కార్పొరేటర్ షఫి, సుభాన్‌బాషా, కరీముల్లా, ఇలియాస్, పులి సునీల్‌కుమార్, న్యాయవాది రాఘవరెడ్డి, నజీర్ అహ్మద్, సీఆర్‌వీ ప్రసాద్, సంఘ సేవకుడు సయ్యద్ సలావుద్దీన్, మగ్బూల్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

వేముల : మండలంలోని వేల్పుల గ్రామంలో గురువారం రాత్రి వల్లూరు లక్ష్మీనారాయణ అనే రైతు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ తనకున్న పొలంలో అరటి పంట సాగు చేశాడు. గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో గాలివాన వస్తున్న సమయంలో తోట వద్దకు వెళ్లాడు అక్కడ మోటార్ స్టార్టర్‌కు ఉన్న ఫీజులు తీసే సమయంలో విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



మెడతోటి మూర్తి మృతదేహం, (ఫైల్)

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలం చిన్నమాచుపల్లె గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మెడతోటి మూర్తి (18) మృతి చెందాడు. తన చిన్నాన్న రాజశేఖర్‌తో కలిసి మూర్తి చెన్నూరుకు వచ్చేందుకు నేషనల్ హైవే రోడ్డు దాటుతుండగా కొక్కరాయపల్లె గ్రామానికి చెందిన తప్పెట వెంకట సుబ్బారెడ్డి ట్రాక్టర్‌తో ఢీ కొన్నాడు. ఈ ఘటనలో మూర్తి తలకు బలమైన గాయమై అక్కక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మహిళ మృతదేహం



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని భద్రపరిచారు. గతనెల 30వ తేదీన మధ్యాహ్నం 3.12 గంటలకు ఆమెను రిమ్స్‌కు తీసుకొచ్చారని, అప్పటికే మృతి చెందిందన్నారు. మృతురాలికి 40 సంవత్సరాలు ఉంటాయని, మృతదేహాన్ని గుర్తించిన వారు రిమ్స్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకు మృతి



ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి

ముద్దనూరు : ముద్దనూరు-జమ్మలమడుగు ఘాట్ రోడ్డులో మునయ్యకోన సమీపంలో గురువారం సాయంత్రం మోటార్‌బైక్‌ను కారు ఢీకొంది. ఈ ఘటనలో మోటార్‌బైక్‌లో ప్రయాణిస్తున్న తండ్రీ కొడుకు మృతి చెందారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు కొండాపురం మండల చౌటపల్లె గ్రామానికి చెందిన హాజీ మహ్మద్(35), నాలుగేళ్ల తన కుమారుడు ఇమాం సాదిక్‌తో కలిసి ముద్దనూరు వైపు ప్రయాణిస్తున్నాడు. మునయ్య కోన సమీపంలోకి రాగానే జమ్మలమడుగు వైపు ప్రయాణిస్తున్న కారు మోటార్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రులిద్దరినీ జమ్మలమడుగుకు తరలించారు. ఆసుపత్రిలో చిన్నారి మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన హాజీ మహ్మద్‌ను కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ఆంధ్ర ఖో–ఖో జట్టు కెప్టెన్‌గా వీరేష్



ఆంధ్ర ఖో-ఖో జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైన వీరేష్

కమలాపురం : స్థానిక పీవీఎస్ఆర్ఎం జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం పూర్తి చేసుకున్న కె. వీరేష్ ఆంధ్ర ఖో-ఖో జట్టుకు కెప్టెన్‌గా ఎంపికై నట్లు కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత నెల 20 నుంచి 23వ తేదీ వరకు చిత్తూరు జిల్లా పుత్తూరు జూనియర్ కళాశాలలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీల్లో పాల్గొన్న వీరేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడన్నారు. దీంతో ఈ నెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఢిల్లీలోని తయంగా రాజ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించే 68వ ఎస్‌జీఎఫ్ అండర్-19 జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్ర జట్టుకు సారథ్యం వహించడానికి వీరేష్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. అలాగే కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డిని, పీడీ ఖాదర్ రెడ్డిని అయన అభినందించారు.

కార్పొరేట్ సంపద కార్మికులకు చెందాలి

ఘనంగా మేడే ర్యాలీ



రైల్వే గూడ్స్‌షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : సంపద సృష్టిలో భాగస్వామ్యమైన కార్మికులకు కార్పొరేట్ సంపద పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ,రైల్వే గూడ్స్‌షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. గురువారం మేడే సందర్భంగా తెలుగు గంగ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఐటీయూసీ పతాకాన్ని ఈశ్వరయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఐక్యతకు హామీ నిచ్చే రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు దేశం విచ్ఛిన్నమైనా పర్వాలేదు అనే ధోరణిలో ప్రధాని నరేంద్ర మోడీ వ్యవహరిస్తున్నారని చెప్పారు. ప్రశ్నించే గొంతుకలను మోడీ అణచివేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిటీష్ కాలం నాటి కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్పొరేట్లయిన అదాని, అంబానీ లాంటి వారికి ఊడిగంగా మార్చివేశారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం తగదన్నారు. అసంఘటిత రంగ హమాలీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సమగ్ర సంక్షేమ చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఎస్.మహబూబ్ బాషా, నాయకులు పాల్, శ్రీను, చిన్న ఓబులేసు, నాగేంద్ర, సూరి, సుబ్బరామ్, రంగనాయకులు, మల్లీ తదితరులు పాల్గొన్నారు.

గాలి, వాన బీభత్సం



నేలకూలిన అరటి తోట



కూలిన అరటి తోట వద్ద రైతు

- నేలకూలిన అరటి
- లబోదిబోమంటున్న రైతులు

వేంపల్లె : ఒక్కసారిగా వాతావరణంలో మేఘాలు కమ్ముకొని వర్షంతోపాటు భారీ ఎత్తున గాలి వీచడంతో అరటి తోటలు నేలకూలాయి. దీంతో అరటి పంట సాగు చేసిన రైతులు లబోదిబోమంటున్నారు. బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన బలమైన గాలులతో వర్షం కురిసింది. దీంతో మండలంలోని వేంపల్లె, కుప్పాలపల్లె, నందిపల్లి, టి.వెలమవారిపల్లెలతోపాటు ఆయా గ్రామాల్లో సాగు చేసిన అరటి పంట వందల ఎకరాల్లో నేల కూలింది. పంట చేతికి వచ్చే సమయంలో గాలితో కూడిన వర్షం కురవడంతో అరటి చెట్లు కింద పడిపోయినట్లు రైతు ఈశ్వరరెడ్డి, రామగంగిరెడ్డి తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో నిమ్మ చెట్లు కూడా గాలికి కూకటి వేళ్లతో పైకి లేచినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అరటి పంటకు ఎకరాకు రూ.2లక్షల పైచిలుకు పెట్టుబడి పెట్టి సాగు చేసినట్లు రైతులు తెలిపారు. ఒక వైపు ధరలు పడి పోవడంతో పాటు మరో వైపు ప్రకృతి కరుణించకపోవడంతో రైతులకు నష్టం కలిగిందని తెలిపారు. 5 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని రూ.15లక్షలు ఖర్చు చేసి వేంపల్లె పొలంలో అరటి సాగు చేసినట్లు కౌలు రైతు ఈశ్వరరెడ్డి తెలిపారు. అరటి పంట కోతకు వచ్చే దశలో భారీగా గాలి వీచడంతో కాయలు గల అరటి చెట్లు కిందపడి పోయినట్లు రైతు రమణారెడ్డి చెప్పారు. అకాల వర్షంతో తీవ్రమైన పంటకు నష్టం వాటిల్లింది. అలాగే పలు చోట్ల చెట్లు విరిగి పడడంతోపాటు మామిడి కాయలు రాలి పోయాయి. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

గాలి గోపురంపై పిడుగు పాటు



పిడుగుపాటుకు దెబ్బతిన్న ఆలయ గాలిగోపురం

వేంపల్లె : స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దుల కొండపై ఉన్న శ్రీవృషభాచలేశ్వర స్వామి ఆలయంపై ఉన్న గాలి గోపురంపై పిడుగు పడింది. దీంతో గాలి గోపురం మీద చెక్కిన కళా శిల్పాలు ధ్వంసమయ్యాయి. బుధవారం రాత్రి వేంపల్లెలో ఉరుములు, మెరుపులతో కూడిన గాలి వాన వీచింది. ఎద్దుల కొండపై ఉన్న ఆలయంపై పిడుగు పడటంతో ఆలయంపై ఉన్న విగ్రహాలు పగిలి పోయాయి. గురువారం వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం ఈఓ విశ్వనాథ్ రెడ్డి, దేవస్థానం మాజీ పాలక మండలి సభ్యుడు పీవీ రమణ, పూజారులు హరి, ప్రవీణ్‌లు వెళ్లి దెబ్బతిన్న గాలిగోపురాన్ని పరిశీలించారు.

నేలకొరిగిన అరటి పంట



ఆకులనారాయణపల్లెలో చెట్టు విరగడంతో తెగిపోయిన విద్యుత్ వైర్లు

కాశినాయన : మండలంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు అరటి తోటలు, విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. బలమైన గాలులు వీచడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బాలాయపల్లె, ఆకులనారాయణపల్లె, వరికుంట్ల, సావిశెట్టిపల్లె, కొండ్రాజుపల్లె, కె.ఎస్.కొట్టాల గ్రామాల్లో దాదాపు 200 ఎకరాల్లో అరటి పంట గాలులకు నేలకొరిగింది. దాదాపు లక్షల్లో నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. ఆకులనారాయణపల్లెలో ఈదురు గాలులకు చెట్లు పడిపోవడంతో విద్యుత్ వైర్లు తెగిపోయాయి. ఉప్పలూరులో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. వరికుంట్ల గ్రామంలో మార్కారెడ్డి అనే రైతుకు చెందిన మామిడితోట కాయ దశలో ఉంది. ఈదురు గాలులకు కాయలన్నీ నేలరాలాయి. విద్యుత్ అధికారులు విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పెనుగాలి విధ్వంసం



రాజులగురువాయిపల్లె సమీపంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్

ముద్దనూరు : మండలంలో పెనుగాలి ధాటికి విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లింది. బుధవారం రాత్రి వీచిన పెనుగాలికి మండలంలోని తిమ్మాపురం, కొత్తపల్లె, రాజులగురువాయిపల్లె, పెనికలపాడు గ్రామాల పరిధిలో సుమారు 10 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వ్యవసాయ, వ్యవసాయేతర విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు గాలికి నేలకొరిగి దెబ్బతిన్నాయి. గురువారం రాత్రి వీచిన గాలికి పలుచోట్ల నష్టం వాటిల్లింది.

కడపలో గాలి దుమారం



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో గురువారం ఉదయం నుంచి తీవ్రమైన ఎండా వేడిమి నెలకొనగా, మధ్యాహ్నం తర్వాత ఒక్కమారుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆకాశం మేఘావృతం కాగా, సాయంత్రం 5.00 గంటల నుంచి పెద్ద ఎత్తున గాలి బీభత్సం సృష్టించింది. ఈ కారణంగా పలుచోట్ల రేకులు పడిపోయాయి. రోడ్డుపై వెళుతున్న పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాలి తీవ్రత కారణంగా విద్యుత్ శాఖ అధికారులు ముందు జాగ్రత్తగా సరఫరాను నిలిపి వేశారు. స్టేట్ గెస్ట్‌హౌస్ వద్ద చెట్టుకొమ్మ విరిగి పడగా ఆ సమయంలో అక్కడా ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గాలి తీవ్రత తగ్గిన చాలాసేపటికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించినప్పటికీ పలు మార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నగర వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.